
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

బుధవారం 17 జనవరి 2024



ఇంటి నిర్మాణ అనుమతికి లంచం అడుగుతున్నారని సీఎం ప్రజావాణిలో బాధితుడి ఫిర్యాదు

పటాన్‌చెరు, జనవరి 16: ఇంటి నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేస్తున్నారని బాధితుడు సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ పంచాయతీ పరిధిలో 150 గజాల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం మైతారం సురేష్‌నాయీా దరఖాస్తు చేసుకున్నారు. రూ. లక్షన్నర లేదా 60 గజాల స్థలం ఇస్తేనే అనుమతి ఇస్తామని సర్పంచ్ పట్నంరాజు, కారోబార్ శ్రీశైలం డిమాండ్ చేస్తున్నారని బేగంపేట ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



మాడ్గి వద్ద రోడ్డు భద్రతపై ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ శివలింగయ్య

రోడ్డు నిబంధనలను పాటించాలి

ఉమ్మడి మెదక్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ శివలింగయ్య

జహీరాబాద్, జనవరి 16: వాహనదారులందరూ రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఉమ్మడి మెదక్ జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ శివలింగయ్య పేర్కొన్నారు. జనవరి 15 నుంచి రోడ్డు భద్రత మాసోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొగుడంపల్లి మండలంలోని మాడ్గి శివారులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడుపుతున్నవారు అన్ని జాగ్రత్తలను పాటించాలని సూచించారు. కొద్దిపాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డుపాలవుతయనే విషయాన్ని గ్రహించాలన్నారు. దేశంలో ప్రతీ మూడు నిమిషాలకో ప్రమాదం జరుగుతున్నదని ఆయన వివరించారు. రోడ్డు నిబంధనలను, సూచనలు పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలను నడిపినప్పుడే ప్రమాదాలను అరికట్ట గలుగుతామని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్టీఏ చెక్‌పోస్టు ఎంవీఐలు డీవీ శ్రీనివాస్ గౌడ్, నరేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విద్యా వలంటీర్లు!

- వీవీల నియామకానికి ప్రభుత్వం సుముఖత
- ఉపాధ్యాయ నియామకాల్లో జాప్యంతో నిర్ణయం
- సంగారెడ్డి జిల్లాలో 5,947 టీచర్ పోస్టుల మంజూరు
- ప్రస్తుతం ఉన్నది 5,079 మంది
- జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో 868 ఖాళీలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి విధుల్లోకి వీవీలు



సంగారెడ్డి అర్బన్, జనవరి 16 : ఉపాధ్యాయ నియామకాల్లో జాప్యం జరుగుతుండడంతో సర్కారు బడుల్లో విద్యావలంటీర్లను నియమించడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విధుల్లో చేరేలా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నది. బడులు తెరిచిన తొలి రోజు నుంచే విద్యా వాలంటీర్లు విధుల్లో ఉండేలా చూడాలని ఇప్పటికే సర్కారు సూచించడంతో విద్యా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏయే పాఠశాలలో వలంటీర్ల అవసరం ఉందనే వివరాలు సేకరిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 868 ఖాళీలు

సంగారెడ్డి జిల్లాలో 1,247 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 1.25 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 5,947 టీచర్ పోస్టులు మంజూరయి ఉన్నాయి. ప్రస్తుతం 5,079 మంది టీచర్లు పనిచేస్తున్నారు. 868 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎక్కువగా సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) టీచర్ పోస్టులు ఎక్కువగా ఖాళీగా ఉన్నాయి. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉన్నది. ఉపాధ్యాయుల కొరత కారణంగా బోధనకు ఆటంకం కలుగుతున్నది. పలుచోట్ల ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. పదో తరగతి ఫలితాలపైనా ఈ ప్రభావం పడుతున్నది. సిబ్బంది కొరతతో విద్యాశాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలులోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడడంతో ఈ ఏడాది 150 మంది టీచర్లను డిప్యూటేషన్‌పై ఖాళీలు ఉన్నచోట సర్దుబాటు చేశారు. జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ 47 ఉన్నాయి. వీటిలో పనిచేసే ఉపాధ్యాయులను కూడా సమీపంలోని పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు.

మూడేళ్ల అనంతరం మరోసారి..

ప్రభుత్వ పాఠశాలల్లో మూడేళ్ల అనంతరం మరోసారి విద్యావలంటీర్ల నియామకం తెరపైకి వచ్చింది. 2019-20 విద్యాసంవత్సరంలో జిల్లాలో 1,293 మంది వలంటీర్లు బోధన కొనసాగించారు. కరోనా కారణంగా 2020 నెలాఖరులో పాఠశాలలు మూతబడ్డాయి. 2020-21 విద్యా సంవత్సరం చివర్లో బడులు తెరిచినా విద్యా వలంటీర్లను మాత్రం విధుల్లోకి తీసుకోలేదు. ఆ తరువాత ప్రభుత్వం శాశ్వత ఉపాధ్యాయ నియామకాలు కూడా చేపట్టలేదు. ఉన్న ఉపాధ్యాయులతోనే నెట్టుకొచ్చారు. తాజాగా ప్రభుత్వం విద్యా వలంటీర్ల నియామకానికి పచ్చజెండా ఊపడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బీఈడీ, డీఎడ్ పూర్తి చేసిన వేల మంది అభ్యర్థులు ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. శాశ్వత నియామకాలు జరిపే వరకు తాత్కాలికంగా వీవీలుగానైనా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ వారికి చెల్లించే వేతనాలు సరిపోతాయి అనేది ప్రశ్నార్థకం. గతంలో వీవీలకు ప్రభుత్వం నెలకు రూ.12 వేల గౌరవ వేతనం చెల్లించింది. ఇపుడు కనీసం రూ.20 వేల వేతనం చెల్లించకపోతే పెరిగిన ధరలకు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు.



సంగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న విద్యావలంటీర్ (ఫైల్)

బడికి దూరంగా 427 మంది పిల్లలు

- లెక్క తేల్చిన పాఠశాల విద్యాశాఖ
- సంగారెడ్డి జిల్లాలో ముగిసిన బడిబయటి పిల్లల సర్వే

సంగారెడ్డి అర్బన్, జనవరి 16 : బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన సర్వే ముగిసింది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 427 మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలబాలికల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ చాలా మంది బడికి దూరంగానే ఉంటున్నారు. అధికారులు పదేపదే అవగాహన కల్పిస్తున్నా బాల్యం మాత్రం బడి బయటే మగ్గుతున్నది. కొందరు బడికి వచ్చి మధ్యలో ఆగిపోగా.. మరికొందరు బడి ముఖమే చూడడం లేదు. దీంతో బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే (ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్-ఓఎస్‌సీ)ను అధికారులు చేపట్టారు. సర్వేలో భాగంగా పని ప్రదేశాలు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి బడి బయటి పిల్లల్ని గుర్తించారు. ఇందులో భాగంగా 6-14 ఏళ్ల లోపు పిల్లలు 427 మంది బడికి దూరంగా ఉంటున్నట్లు విద్యా శాఖ చేపట్టిన సర్వేలో తేల్చారు. వీరందరినీ తిరిగి బడికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థి సామర్థ్యం, వయసు ప్రకారం అర్హత ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించేలా కృషి చేయనున్నామని, చదువుకు ఎవరు దూరం కావొద్దనే లక్ష్యంతో విద్యా శాఖ ప్రతీ సంవత్సరం చర్యలు తీసుకుంటున్నదని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.



సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లిలో బడి బయటి పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీ (ఫైల్)

హుస్నాబాద్‌లో వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించండి

టీటీడీ చైర్మన్‌కు మంత్రి పొన్నం వినతి

హుస్నాబాద్, జనవరి 16 : హుస్నాబాద్ పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన తిరుమలలో కుటుంబ సమేతంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలో కరుణాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆలయానికి సరిపడా స్థలాన్ని సమకూర్చుతామని, తగిన నిధులు కేటాయించాలని కోరారు.

పట్టణంలో మార్నింగ్ వాక్

సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హుస్నాబాద్ పట్టణంలోని 4, 5 వార్డుల్లో మార్నింగ్ వాక్ చేశారు. మహిళలు వేస్తున్న ముగ్గులను పరిశీలించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, ప్రజలతో కలిసి హోటల్‌లో టీ తాగారు. ఆయన వెంట టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 16: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రజల జీవన ప్రమాణంలో మార్పులు వస్తాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు ఈ నెల 31 లోపు తయారుచేసి 'ఈ-గ్రామ్‌స్వరాజ్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా, మండలస్థాయి ప్లాన్‌లు ఫిబ్రవరి నెలలో తయారు చేయాలని ఆదేశించారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ ట్రస్ట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులు ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖాధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పనుల వివరాలు, పూర్తిచేయాల్సిన, కొనసాగుతున్న పనులతో పాటు ప్రారంభం కాని పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 181 పనులకు 102 పనులు పూర్తి చేశామని అధికారులు విరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ పనులను వెంటనే పూర్తిచేయాలని నిర్దేశించారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో సాయిబాబా, సీఈవో శైలేష్, సీపీవో కృష్ణయ్య, వివిధ శాఖాధికారులు నర్సింహులు, సర్దార్‌సింగ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 16 : జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులందరూ సమష్టిగా పనిచేసి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వైద్యారోగ్య శాఖకు సంబంధించి నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పీహెచ్‌సీలు, ఎంసీహెచ్, సబ్‌సెంటర్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించిన మన ఊరు-మన బడి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఆయా శాఖలకు సంబంధించి ఇప్పటికే పూర్తయిన భవనాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద చేపట్టిన ఆయా పనుల్లో పురోగతిలో ఉన్నవాటిని వెంటనే పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే లోపు అన్ని పనులు ప్రారంభించాలని, పురోగతిలో ఉన్న పనులను కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. చేపట్టిన పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, పనుల్లో పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ఓటరు నమోదుకు ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ క్రాంతి తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తూ జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక శిబిరాలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రత్యేక శిబిరాల గురించి సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహించే రెండు రోజుల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని తెలియజేశారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం 6 నింపాలని, మార్పులు, చేర్పులకు ఫారం 8ని పూర్తిచేసి ఇవ్వాలని సూచించారు. ఓటరుగా నమోదైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రి, జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్, డీసీహెచ్ఎస్ సంగారెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు

మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి 16: ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి మంగళవారం ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం ఎంతో వ్యయం చేసి ప్రజలకు సుఖవంతమైన ప్రయాణం కోసం రోడ్లను ఏర్పాటు చేస్తే.. ట్రాక్టర్లను కేజ్‌వీల్స్‌తో బీటీ, రోడ్లు, సీసీ రోడ్లపై నడుపుతుండడంతో రహదారులు పాడవుతున్నాయని పేర్కొన్నారు. ట్రాక్టర్ల యాజమానులు పొలాల్లో పని నిమిత్తం ఒకచోటి నుంచి మరోచోటికి వెళ్లేటప్పుడు కేజ్‌వీల్స్‌తో నడపొద్దన్నారు. ఇలా నడుపుతున్న ట్రాక్టర్ యాజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసకుంటామని హెచ్చిరించారు. ఆ విషయాన్ని గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అద్దె భవనాల్లోనే ఆఫీసులు

- అరకొర వసతులతోనే కొనసాగింపు
- అవస్థలు పడుతున్న ప్రజలు, అధికారులు



అద్దె భవనంలో నిర్వహిస్తున్న తసీల్దార్ కార్యాలయం

హవేళిఘణపూర్, జనవరి 16: గత ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసింది. కానీ జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు మాత్రమే నిర్మించారు. డివిజన్ కేంద్రాలు, మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించలేదు. మెదక్ జిల్లా హవేళిఘణపూర్ కేంద్రంగా నూతన మండలం ఏర్పాటుచేసి ఆరు సంవత్సరాలవుతున్నా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ ఆఫీసు, పోలీస్ స్టేషన్, ఇందిరాక్రాంతి పథకం ఆఫీసుతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు తాత్కాలిక ప్రాతిపదికన అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మండల వ్యవసాయాధికారి కార్యాలయం రైతువేదికలో కొనసాగుతున్నది. సరైన వసతులు లేకపోవడంతో మండల విద్యాధికారి కార్యాలయం ఇప్పటికీ మండల కేంద్రంలో ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కార్యాలయాలు నిర్మించేందుకు ఐదెకరాల స్థలం అందుబాటులో ఉన్నా ఒక్క ఆఫీసు నిర్మించేందుకు కూడా నిధులు మంజూరు కాలేదు. అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లోనే ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నామని అధికారులు వాపోతున్నారు. సీజ్ చేసిన వాహనాలు, ప్రమాదాలకు గురైన వాహనాలను ఉంచేందుకు స్థలం లేక పోలీసులు తంటాలు పడుతున్నారు. మడల పరిషత్ కార్యాలయం చిన్నగా ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే సమావేశానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తసీల్దారు కార్యాలయం, ఐకేపీ కార్యాలయాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్



సమీక్ష ఎప్పుడు సార్!

- నివేదికలు సిద్ధం చేసిన అధికారులు
- మంత్రి పిలుపు కోసం ఎదురుచూపులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 16: సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై త్వరలో సమీక్ష నిర్వహిస్తా.. నివేదికలు సిద్ధం చేసుకోండని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ బాధ్యతలు చేపట్టిన అనంతరం అధికారులను ఆదేశించారు. నెల రోజుల క్రితం మంత్రి చేసిన సూచనలతో జిల్లా అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. నెల రోజులుగా మంత్రి నుంచి పిలుపు రాకపోవడంతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో గత నెల ప్రారంభంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో సంగారెడ్డి జిల్లా అందోల్ ఎమ్మెల్యే సి.దామోదర్ రాజనర్సింహ కీలకమైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా నియమితులయ్యారు. రెండుమూడు రోజులకు ఆయన సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అప్పటి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులందరూ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ త్వరలోనే జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష జరుపుతామని వారికి తెలియజేశారు.

నివేదికలతో నిరీక్షణ

మంత్రి ఆదేశాలతో జిల్లాస్థాయి అధికారులందరూ తమ శాఖల కార్యకలాపాలపై నివేదికలు సిద్ధం చేసుకున్నారు. నెల రోజుల నుంచి మంత్రి ఎప్పుడు పిలుస్తారో? ఏ రోజు సమీక్ష జరుపుతారోనని నిరీక్షిస్తున్నారు.

జిల్లాలో విస్తృత పర్యటనలు

జిల్లా నుంచి కొత్తగా ఎవరు మంత్రిగా నియమితులైనా జిల్లాలో జరిగిన అభివృద్ధి, కార్యక్రమాలపై అవగాహన కోసం సమీక్ష జరపడం సహజం. పనుల్లో పురోగతిని పరిశీలించి ఎక్కడైనా లోపాలుంటే గుర్తించి సరిచేస్తారు. జాప్యం లేకుండా వెంటనే పూర్తిచేయించేలా ఆదేశిస్తారు. అయితే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం దామోదర్ రాజనర్సింహ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. కానీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించలేదు. కనీసం తాను చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాల గురించి కూడా సమీక్ష జరపకపోవడంపై ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

పైసలు లేక ఆగిన నిర్మాణాలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి 124 సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్నెల్ల కిందట జిల్లా కలెక్టర్ వీటి నిర్మాణాలకు మంజూరు ఇస్తూ ప్రొసిడింగ్‌లు ఇచ్చారు. నిర్మాణాల బాధ్యతను పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, టీఎస్ ఎంఎస్ఐడీసీ, డీఆర్‌డీఏ‌కు అప్పగించారు. కానీ నిధులు ఇవ్వరన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు డీఆర్డీఏ ఆధీనంలోని స్వయం సహాయక సంఘాలు నిర్మాణాలు చేపట్టలేదు. అక్కడక్కడ నిర్మాణాలు చేపట్టినా.. నిధులు లేక కాంట్రాక్టర్లు మధ్యలోనే ఆపేశారు. పైసలు ఇస్తేనే పనులు పూర్తి చేస్తామంటున్నారు. నిధులు లేకపోవడంతో చేసేదేమీ లేక సంబంధిత అధికారులు చేతులెత్తేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమీక్ష నిర్వహిస్తే జిల్లాలోని పరిస్థితులను తెలుసుకొనే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదల చేయిస్తే నిర్మాణాలు పూర్తిచేయించవచ్చని అధికారులు భావిస్తున్నారు. సంగారెడ్డిలోని మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలను సందర్శిస్తే బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను గురించి ఆయన తెలుసుకుంటారని, ఆయన దృష్టి సారిస్తే వెంటనే ఖాళీలు భర్తీ చేయించగలరని అంటున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీచేస్తే రోగులకు ఏ మేరకు వైద్య సహాయం, ఆహారం అందుతుందనే విషయాలను తెలుసుకుని మెరుగైన సాయం అందించడానికి మంత్రి సహకరిస్తారని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి సమీక్ష కోసం మిగిలిన శాఖల కంటే వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు, జిల్లా నాయకులు ఎక్కువగా ఎదరుచూస్తున్నారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆశల పల్లకిలో అధికారపార్టీ నాయకులు

● నామినేటెడ్ పోస్టుల కోసం పోటాపోటీ

గజ్వేల్, జనవరి 16: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరడంతో నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. నామినేటెడ్ పోస్టులను ఇటీవల ప్రభుత్వం రద్దు చేయడంతో ఒక్కసారిగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశలు పెంచుకున్నారు.

మార్కెట్ కమిటీలకు తీవ్ర పోటీ

గజ్వేల్, వంటిమామిడి మార్కెట్‌కమిటీల చైర్మన్ పదవులకు అనేక మంది పోటీపడుతున్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కితే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల్లో ప్రొటోకాల్ దక్కుతుందని పలువురు నాయకులు భావిస్తున్నారు. అలాగే వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేస్తే వర్గల్, ములుగు, మర్కుక్ మండలాల్లో ప్రొటోకాల్ లభించనున్నది. గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన సీనియర్ నాయకులు పోటీపడుతుండగా, గజ్వేల్ మాజీ ఎంపీపీ, గజ్వేల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జగదేవ్‌పూర్ కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్‌కు వేలూరు, వర్గల్, నెంటూరు, బైలంపూర్, తునికిబొల్లారం గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులు పోటీపడుతున్నారు. ఇక నాచగిరి దేవస్థాన కమిటీకి గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాదితో పాటు ఉమ్మడి తూప్రాన్‌కు చెందిన పలువురు నాయకులు పోటీపడుతున్నారు. కొండపాక ఏఎంసీ చైర్మన్ పదవికి ఇరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటీపడుతుండగా, జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయ కమిటీకి దౌలాపూర్ గ్రామ నాయకుడితో పాటు పలువురు ఆశిస్తున్నారు. ఇక గ్రామస్థాయిలో ఉన్న నాయకులకు ఆయా నామినేటెడ్ పోస్టులలో డైరెక్టర్ పదవులు దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు వారివారి గాడ్‌ఫాదర్లను కలిసి ఆశీస్సులు పొందుతున్నట్లు తెలుస్తుంది. యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డిని సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్మన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌లలో ఏదో ఒక స్థానానికి పోటీ చేయించాలని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తుంది. కాగా ప్రస్తుతానికి నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. తెలుస్తుంది.

భూతగాదాల విషయంలో దంపతులపై దాడి



తలకు తీవ్ర గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయిలయ్య

గజ్వేల్, జనవరి 16: భూతగాదాల విషయంలో అన్నవదినలపై తమ్ముడు, అతని బంధువులు దాడికి పాల్పడిన సంఘటన గజ్వేల్ మండలం జాలిగామ శివార్లలో మంగళవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన చెట్కూరి అయిలయ్యకు నాలుగు ఎకరాల భూమి ఉంది. సదరు భూమి వెనకాలే ఆయన సోదరుడు చెట్కూరి నాగయ్యకు భూమి ఉండడంతో దారి ఇవ్వాలని గొడవపడ్డారు. ఈ విషయమై మంగళవారం ఉదయం నాగయ్య గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అయిలయ్య అయన భార్య భాగవ్వలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తిరిగి గజ్వేల్ నుంచి ఇంటికి వారి ద్విచక్రవాహనంపై అయిలయ్య-భాగవ్వలు బయలుదేరారు. జాలిగామ శివార్లలోకి చేరుకోగానే చెట్కూరి నాగయ్య, అతడి భార్య లక్ష్మి, రాయపోల్ మండలం ముంగాజుపల్లికి చెందిన పుల్ల మల్లయ్య, అదే గ్రామానికి చెందిన పుల్ల బాబు తదితరులు అయిలయ్య వాహనాన్ని అడ్డగించి, బూతులు తిడుతూ దంపతులపై కర్రలతో దాడి పాల్పడ్డారు. ఈ దాడిలో అయిలయ్య తలకు, భాగవ్వ కాలుకు గాయాలు కాగా దాడికి పాల్పడినవారు అక్కడి నుంచి గజ్వేల్‌కు వెళ్లిపోయారు. దాడి ఘటనను గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనానికి సమాచారం అందించగా బాధితులను గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు గజ్వేల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై అయిలయ్య కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ-2 రంగ కృష్ణ తెలిపారు.

పందిల్ల నిత్యాన్నదాన సత్రంలో లేగ దూడకు నామకరణం



లేగ దూడకు నామకరణం చేస్తున్న గోసేవ సత్రం నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 16: హుస్నాబాద్ మండలం పందిల్లలో సిద్దిరామేశ్వర నిత్యాన్నదాన సత్రంలో జన్మించిన లేగదూడకు నామకరణోత్సవం చేశారు. సత్రంలో ప్రత్యేక తొట్టి(ఊయల) ఏర్పాటు చేసి తొట్టిలో లేగదూడను వేసి నందీశ్వరునిగా నామకరణం చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానం పాలక వర్గం మాజీసభ్యులు మురంశెట్టి రాములు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. లేగదూడకు నందీశ్వరుడిగా నామకరణం చేశారు.

సదాశివపేట బల్దియాలో అవిశ్వాసం?

● పావులు కదుపుతున్న బీఆర్ఎస్ చీలికవర్గం ● మద్దతిస్తున్న ఓ కౌన్సిలర్ భర్త

సదాశివపేట, జనవరి 16: సంగారెడ్డి జిల్లా సదాశివపేట బల్దియా చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్ అసంతృప్తి కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీఆర్ఎస్ పాలకవర్గాన్ని గద్దె దింపే ఆలోచనలో కాంగ్రెస్ నాయకులు సైతం తెర వెనుక అండగా నిలుస్తున్నారని ప్రచారం. నేడో, రేపో కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్టు చర్చ సాగుతున్నది. కౌన్సిలర్‌గా కొనసాగుతున్న చైర్‌పర్సన్ కుమారుడి తీరుపై విసుగెత్తి ఎట్టిపరిస్థితుల్లో అవిశ్వాసం పెట్టి తీరాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు భావిస్తున్నారు.



సదాశివపేట మున్సిపల్ కార్యాలయం

వారికి చైర్‌పర్సన్ పదవిపై ఆశతో ఇటీవల బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఓ కౌన్సిలర్ భర్త మద్దతు తెలుపుతున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 'బల్దియా'పై కాంగ్రెస్ జెండా ఎగరేయాలనే లక్ష్యంతో అధికార పార్టీ ముందుకు వెళ్తున్నది. ఇటీవల బీజేపీ నుంచి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఓ కౌన్సిలర్ భర్త తన భార్యను బల్దియా పీఠంపై కూర్చోబెట్టాలనే కృతనిశ్చయంతో అసంతృప్త కౌన్సిలర్లతో పలుమార్లు మంతనాలు జరిపి నయానో భయానో తనవైపు తిప్పుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఆర్థికంగా చక్కదిద్దుకోవాలనుకుంటున్న కొందరు కౌన్సిలర్లు కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.

దుబ్బాక మున్సిపల్‌పై అవిశ్వాస నీడ!

● పావులు కదుపుతున్న కౌన్సిలర్లు
● చైర్‌పర్సన్ భర్తపై తీవ్ర అసంతృప్తి
● స్వచ్ఛంద రాజీనామాకు చైర్‌పర్సన్ ప్రయత్నం
● ఎమ్మెల్యే అనుమతి కోసం ఎదురు చూపులు

దుబ్బాక, జనవరి 16: సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నీడలు కమ్ముకుంటున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూమిరెడ్డిని స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాలని కౌన్సిలర్‌లంతా ఒత్తిడి తెస్తున్నారు. ఆమె భర్త భూమిరెడ్డి వ్యవహారశైలి తమకు నచ్చడంలేదని సుమారు రెండున్నరేళ్ల నుంచి కౌన్సిలర్లు గ్రూపులుగా విడిపోయారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కౌన్సిలర్లను సముదాయించుకుంటూ వస్తున్నారు. అయినా కూడా భూమిరెడ్డి వ్యవహార శైలి మారకపోవడంతో మంగళవారం సుమారు 15మంది కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసి, తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. తాము అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టకముందే పదవి నుంచి తప్పుకోవడం ఉత్తమమని చైర్‌పర్సన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. తమ అసమ్మతిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కౌన్సిలర్లతో బుధవారం సమావేశం కానున్నారు. ఆ తర్వాత తమ నిర్ణయం ప్రకటించనున్నట్లు అసమ్మతి కౌన్సిలర్లు తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది. మున్సిపల్ వ్యవహారం ఎమ్మెల్యే చేతిలో పెట్టాలని, ఆయనదే తుది నిర్ణయమని వారంటున్నారు.



క్రిమి సంహారక మందు చల్లడంతో

ఉల్లి తిమ్మాయిపల్లిలో మృతి చెందిన చేపలు

● సుమారు రూ.రెండున్నర లక్షల వరకు నష్టం


చనిపోయిన చేపలు, చెరువు వద్ద దొరికిన మందు డబ్బా

చేగుంట, జనవరి 16: మెదక్ జిల్లా చేగుంట మండలం ఉల్లి తిమ్మాయిపల్లి గ్రామంలోని వడ్లోనికుంట చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు క్రిమి సంహారక మందు చల్లడంతో చేపలు చనిపోయాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం జరిగింది. గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యుడు తలారి సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వడ్లోనికుంట చెరువులో 50వేల చేపపిల్లలు వేయగా.. అవి పెద్దవై అమ్మకానికి వచ్చాయి. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో క్రిమి సంహారక మందు చల్లడంతో చేపలన్నీ చనిపోయి, సుమారు రెండున్నర లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లింది. ఈ విషయమై మెదక్ మత్స్య శాఖ అధికారులతో పాటు చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మత్స్య శాఖ అధికారులు, చేగుంట పోలీసులు చెరువును పరిశీలించారు. చెరువు వద్ద దొరికిన క్రిమిసంహారక మందుడబ్బాను అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


లక్ష్మి(ఫైల్)

కొండపాక, జనవరి 16: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కొండపాకలో సోమవారం రాత్రి జరిగింది. కొండపాక గ్రామానికి చెందిన కాశబోయిన లక్ష్మి(60)కి సోమవారం రాత్రి ఇంట్లో నీళ్లు వేడి చేయడం కోసం పెట్టిన వాటర్ హీటర్ తగలడంతో షాక్‌కు గురైంది. తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య


చంద్రకళ(ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి 16: జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన హవేళిఘణపూర్ మండలం ఔరంగాబాద్‌లో సోమవారం రాత్రి జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఔరంగాబాద్ గ్రామానికి చెందిన ఎర్రి చంద్రకళ(48) అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. సోమవారం రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనం చేసి పడుకున్నది. రాత్రి ఆమె కుమారుడు విజయ్ మూత్ర విసర్జనకు లేచి చూడగా చంద్రకళ కనిపించలేదు. ఆరుబయట వెతకగా పక్కనే ఉన్న చెట్టుకు చీరతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతురాలికి భర్త, కొడుకు, కోడలు ఉన్నారు.

కారు బోల్తా పడి ఒకరి మృతి


మృతి చెందిన కమలమ్మ

అక్కన్నపేట, జనవరి 16: అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న కారు బోల్తా పడి కల్వర్టులోకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన గర్నెపూడి అబేదజ్ఞాగో ఆయన భార్య రేవతి, అత్త గుజ్జర్లపూడి కమలమ్మ(84) కారులో గుంటూరు నుంచి కరీంనగర్‌కు వెళ్తున్నారు. అక్కన్నపేట శివారుకు చేరుకోగా అతివేగం, అజాగ్రత్తతో నడుపుతున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న కమలమ్మ అక్కడికక్కడే మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువు రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

● అల్లుడే కారణమంటూ మృతురాలి తండ్రి ఫిర్యాదు


సుధారాణి(ఫైల్)

రాయపోల్ జనవరి 16: మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మృతులాలి తండ్రి, ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామానికి చెందిన గొడుగు సుధారాణి(30)ని చిన్న మాసానిపల్లి గ్రామానికి చెందిన గొడుగు నర్సింహులుకిచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. సోమవారం చిన్నఆరేపల్లిలో జరిగిన బంధువు దశదినకర్మకు వెళ్లిన సుధారాణి సాయంత్రం తన కొడుకుతో కలిసి పెద్దఆరెపల్లిలోని తల్లి గారి ఇంటికి వెళ్లింది. కొంతసేపటి తర్వాత భర్త నర్సింహులు పెద్దఆరెపల్లికి వచ్చి భార్యను తిడుతూ ఇంటికి రావాలని ఒత్తిడి చేసి, భార్య, కొడుకును తీసుకొని చిన్న మాసాన్‌పల్లికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో సుధారాణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఆమె తండ్రికి ఫోన్ రావడంతో ఆయన హుటాహుటిన అక్కడికి వెళ్లాడు. సుధారాణి మృతిపై ఆమె భర్తపైన అనుమానం ఉన్నదని మృతురాలి తండ్రి అరిగె యాదయ్య రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


హరికిషన్ (ఫైల్)

రాయపోల్, జనవరి 16: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, బేగంపేట ఎస్ఐ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కల్‌కు చెందిన బర్కం హరికిషన్(27) ఇటీవల అప్పు చేసి ఇల్లు కట్టాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పు తీర్చడం ఇబ్బందిగా మారిందని తరచూ భార్యతో చెప్పుకుంటూ బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో ఈ నెల 14న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతకగా పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఈ మేరకు మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

హవేళిఘణపూర్, జనవరి 16: వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన వడ్ల మహేష్(23) సోమవారం ద్విచక్ర వాహనంపై మెదక్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఔరంగాబాద్ గ్రామ శివారులోకి చేరుకోగా అక్కడ వాటర్ ట్యాంకర్‌ను డ్రైవర్ రివర్స్ తీస్తున్నాడు. ఇది గమనించకుండా ద్విచక్రవాహనాన్ని పోనివ్వడంతో ట్యాంకర్‌కు తగిలి తలకు తీవ్రగాయాలై మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, జనవరి 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని ఔరంగాబాద్‌తండాకు చెందిన నేనావత్ లక్ష్య(48) ఆర్టిజన్ ఉద్యోగిగా మెదక్ పట్టణంలో పనిచేస్తున్నాడు. సోమవారం తన వాహనంపై హవేళిఘణపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా స్కూల్‌తండా శివారులోని మూలమలుపు వద్ద కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మెదక్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కొడుకు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

కానుకుంటలో ఇరు వర్గాల ఘర్షణ

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు ● డీఎస్పీ విచారణ

గుమ్మడిదల జనవరి 16: ఈ నెల 13న కానుకుంట గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఏడుగురిపై గ్రామానికి చెందిన గుండగల విజయ్ ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. నిజ నిర్ధారణ మేరకు మంగళవారం కానుకుంట గ్రామంలో పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి నేతృత్వంలో పూర్తిస్థాయి విచారణ జరిపినట్టు జిన్నారం సీఐ వేణుకుమార్ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. మృతదేహమై లభ్యం


షేక్ సిద్ధిక్(ఫైల్)

రామాయంపేట, జనవరి 16: మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి మంగళవారం మృతదేహమై కనిపించాడు. రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తీలో నివసిస్తున్న షేక్ సిద్ధిక్(52) ఆదివారం తన ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం సిద్దిపేట రహదారిలోని మల్లె చెరువులో షేక్ సిద్ధిక్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారాన్ని తెలుసుకున్న ఎస్ఐ రంజిత్ మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్ఐ రంజిత్ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

అక్కన్నపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లి గ్రామానికి చెందిన బబ్బురు సదానందంగౌడ్ మంగళవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్ వాహనం ద్వారా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని పలువురు కోరారు.

పోలీసుల విధులకు ఆటంకం

● నలుగురి రిమాండ్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ రాజు

జహీరాబాద్, జనవరి 16: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో సోమవారం పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన గౌస్‌షా, కాలపల్లి యోసెఫ్, సూర్యాపేట ప్రవీణ్, చాకలి శ్రీనివాస్‌లను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ రాజు, పట్టణ ఎస్ఐ-2 శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14న రాత్రి 10 గంటల సమయంలో పస్తాపూర్‌లో గొడవ జరుగుతున్నదని 100 నంబర్‌కు కాల్ రావడంతో పోలీసు సిబ్బంది తిరుపతి, శ్రీనివాస్, అశోక్ గ్రామానికి వెళ్లారు. గొడవ చేస్తున్నవారిని వారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గౌస్‌షా, కాలపల్లి యోసెఫ్, సూర్యపేట ప్రవీణ్, చాకలి శ్రీనివాస్ వినకుండా పోలీసులపై దాడిచేసి, విధులకు ఆటంకం కలిగించారు. గాయాలకు గురైన కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని సీఐ, ఎస్ఐ వెల్లడించారు.

రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన


సంగారెడ్డి మండలం ఫసల్‌వాది చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ అధికారులు

సంగారెడ్డి రూరల్, జనవరి 16: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ చౌరస్తా వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లకు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించకూడదని, వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, వాహనం నడిపే సమయంలో ఫోన్ మాట్లాడకూడదని సూచించారు. వీటివల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

హవేళిఘణపూర్, జనవరి 16: కోతుల దాడిలో ఇద్దరికి గాయాలైన సంఘటన హవేళిఘణపూర్‌లో జరిగింది. ఆదివారం రాత్రి హవేళిఘణపూర్ గ్రామానికి చెందిన వడ్ల ఫణిరాజు ఇంటిని చుట్టుముట్టిన కోతుల మూకను వెళ్లగొడుతుండగా.. అవి వెంటపడి చేతిని కరిచాయి. వెంటనే మెదక్ జిల్లా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన వడ్ల నాగరాజు కూడా కోతులను తరుముతుండగా వెంటపడ్డాయి. పరుగులు తీస్తున్న నాగరాజు కిందపడడంతో కాలు విరిగింది.

ఈతవనంలో చెలరేగిన మంటలు

● 3,000ల చెట్లు బుగ్గిపాలు, రూ.4 లక్షల ఆస్తి నష్టం
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎక్సైజ్ సీఐ
● రామాయంపేట శివారులో ప్రమాదం


రామాయంపేటలో మంటల్లో ఈతవనం

రామాయంపేట, జనవరి 16: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ శివారులోని ఈతవనంలో సోమవారం మంటలు చెలరేగి, సుమారు 3,000ల ఈత చెట్లు బుగ్గిపాలయ్యాయి. రూ.4లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో స్థానిక గీత కార్మికులు ఉపాధిని కోల్పోవాల్సి వచ్చింది.

సోమవారం సాయంత్రం ఇక్కడ అటవీ ప్రాంతంలో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు ఈతవనాన్ని చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న స్థానిక గీత కార్మికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పదివేల చెట్లు ఉన్న వనంలో మూడువేల దాకా కాలి బూడిదయ్యాయి. రామాయంపేట గీత పారిశ్రామిక సహకార సంఘం వారు దశాబ్దంన్నర క్రితం అయిదెకరాల స్థలంలో పదివేల ఈత మొక్కలు నాటగా నేడు అవి పెరిగి పెద్దవై ప్రతి నిత్యం 400 నుంచి 500 లీటర్ల వరకు కల్లును అందిస్తున్నాయి. ఈ క్రమంలో జరిగిన అగ్ని ప్రమాదంతో ప్రస్తుతం కల్లును అందించే చెట్లు కాలిపోవడంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులు ఆదాయాన్ని కోల్పోయారు. కార్మికుల ఉపాధికి గండి పడినట్లయింది. అయితే, పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో చెలరేగిన ఈ మంటలు ఈతవనంలోకి చొచ్చుకు వచ్చాయని సహకార సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాసగౌడ్ స్థానిక ఎక్సైజ్ సీఐ జయసుధకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సీఐ తమ సిబ్బందితో ఈతవనాన్ని పరిశీలించి, పంచనామా చేశారు.

తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు ఇస్తామంటూ మోసం

● శామీర్‌పేట్ నిధి లిమిటెడ్ పేరుతో సంస్థ ఏర్పాటు
● నమ్మి డబ్బు కట్టి, మోసపోయిన ఎల్కల్ గ్రామవాసులు
● భార్యాభర్తలను అరెస్టు చేసిన బేగంపేట పోలీసులు

రాయపోల్, జనవరి 16: ఫైనాన్స్ పేరుతో తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్న భార్యాభర్తలను అరెస్టు చేసినట్లు సిద్దిపేట జిల్లా బేగంపేట ఎస్ఐ అరుణ్ తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన భాగవతం శివశంకర్, భాగవతం శశికళ భార్యాభర్తలు. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా 2022 జనవరిలో శామీర్‌పేట్ నిధి లిమిటెడ్ పేరుతో ఓ కంపెనీని ఏర్పాటు చేశారు. గజ్వేల్, సిద్దిపేట, ముత్తంగి, కందుకూరు, దేవరకొండ, నల్గొండ ప్రాంతాల్లో దాని ద్వారా చిట్ నడిపిస్తామని, రుణాలు ఇప్పిస్తామని చెబుతూ రెండు స్కీములను ప్రవేశపెట్టారు. అందులో భాగంగా వారి వద్ద ఎవరైనా కొంత డబ్బు కడితే 45రోజుల తర్వాత కట్టిన దానికి పది రెట్లు అధికంగా ఇస్తామని, నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేస్తామని చెక్కులు ఇచ్చేవారు. ఈ క్రమంలో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్కల్ గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ, ఇంటెనుక నరసవ్వ, పిట్ల చిన్న వెంకటయ్య, మర్కంటి రాజు, దోసేపల్లి లింగంల వద్ద మొత్తం రూ.2లక్షల 60వేలు తీసుకుని అందుకు పది రెట్లు 45రోజుల తర్వాత ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో బేగంపేట ఎస్ఐ అరుణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శివశంకర్, శశికళ ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి వారి నుంచి శామీర్‌పేట్ నిధి లిమిటెడ్‌కు సంబంధించిన రికార్డులను, బాండ్‌లను, స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్ మాట్లాడుతూ.. ఫైనాన్స్ ఇస్తామని, డబ్బులు రెట్టింపు చేస్తామని, రకరకాల మోసాలతో గ్రామాల్లో తిరిగే వ్యక్తులను నమ్మవద్దని, వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు.

ఇస్లాంపూర్ రామప్పగుట్టపై బండ్ల ఊరేగింపు


తూప్రాన్ మండల రామప్పగుట్టపై ఎడ్లబండ్ల ఊరేగింపు


సంగారెడ్డి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నోములు నిర్వహిస్తున్న దృశ్యం

తూప్రాన్, జనవరి 16: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన స్వయంభు భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం జాతర నిర్వహించారు. ఆలయ పూజారి శలాక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బండ్లు, బోనాల ఊరేగింపుతో పాటు సాయంత్రం జాతర నిర్వహించారు. ఉత్సవాలకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గోపాల కాలువలు, స్వామి సేవా ఊరేగింపు నిర్వహించారు. బుధవారం హోమం, రథోత్సవం నిర్వహించనున్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పంచ కల్యాణ మహోత్సవం

సంగారెడ్డి రూరల్, జనవరి 16 : సంగారెడ్డి పట్టణ శివారులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ మహా సంస్థాన్ ఆధ్వర్యంలో పంచకల్యాణ నోముల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్, ఉపాధ్యక్షుడు రాధాకిషన్, మహిళా సంఘం అధ్యక్షురాలు మాలతి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి మల్లేశం, సభ్యులు విద్యాసాగర్, బుచ్చిలింగం, శివకుమార్, కృష్ణవేణి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

పాత పంటల జాతర

● డీడీఎస్ ఆధ్వర్యంలో సిద్ధాపూర్‌లో తృణధాన్యాల సాగు, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై గిరిజన ప్రజలకు అవగాహన

కోహీర్, జనవరి 16: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని సిద్ధాపూర్ తండాలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సభ్యులు మంగళవారం చిరుధాన్యాల విశిష్టతను వివరిస్తూ పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుశీలాబాయి ఎడ్లబండ్లకు పూజ చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎస్ సంఘం మహిళలు పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ విత్తనాలతో అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరేగింపులో గిరిజన ప్రజలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పాత పంటల అవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు డీడీఎస్ మహిళా సభ్యులు మాట్లాడుతూ.. గిరిజన తండాల్లో కూడా చిరుధాన్యాల సాగు చేపట్టాలని కాంక్షించారు. పూర్వం గ్రామాల్లో రైతులు చిరుధాన్యాల పంటలైన సజ్జలు, కొర్రలు, సామలు, జొన్నలు, మినుములు, పెసర పండించే వారని గుర్తు చేశారు. ప్రస్తుత రోజుల్లో రసాయన మందులు పిచికారి చేయడం వల్ల పూర్తిస్థాయిలో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పంటలు లభించడం లేదని పేర్కొన్నారు. దీంతో అనారోగ్యాలకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. పూర్వపు రోజుల మాదిరిగా మళ్లీ చిరుధాన్యాల సాగును పెంపొందిస్తే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. తృణధాన్యాల పంటల సాగుకై కృషి చేస్తున్న డీడీఎస్ వారిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భేమ్‌సింఘ్, డీడీఎస్ సిబ్బంది సుక్కమ్మ, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విత్తనాలతో అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


తృణధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తున్న డీడీఎస్ సభ్యులు



సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలో గాలిపటం ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



పెద్దశంకరంపేట: ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని గీతా మందిరంలో మహిళల సంక్రాంతి నోములు

సంబరంగా సంక్రాంతి వేడుకలు



కోహీర్: ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, సదాశివపేట, జహీరాబాద్, కోహీర్, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, అందోల్, పుల్కల్, హత్నూర, మెదక్ జిల్లాలోని తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట, చేగుంట, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, చిలప్‌చెడ్, వెల్దుర్తి, మనోహరాబాద్ మండలాల్లో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. ముత్యాల ముగ్గులతో లోగిళ్లు మురిపించాయి. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు కనువిందు చేశాయి. పండుగ వేళ ఆలయాలు కిటకిటలాడాయి.

- న్యూస్ నెట్‌వర్క్



నారాయణఖేడ్: పట్టణంలో సంక్రాంతి సందర్భంగా ఆకట్టుకునే విధంగా విష్ణుపాదం ముగ్గు వేసిన లావణ్య



నారాయణఖేడ్ ప్రాంతంలో ఆరు గ్యారంటీల ముగ్గు



చిన్నశంకరంపేట: గవ్వపల్లిలో క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేస్తున్న హర్షవర్ధన్‌రావు, నాయకులు



రామచంద్రాపురం: గాలి పటాన్ని ఎగురవేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

సమాచారం

రుద్రారంలో ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, జనవరి 16: చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారంలో మంగళవారం చర్చి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్‌ఐ నారాయణగౌడ్, సర్పంచ్ లక్ష్మణ్ ప్రారంభించారు. నాయకులు నర్సింహులు, రాములు, మురళి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకి తరలిన అయ్యప్ప స్వాములు

మాసాయిపేట, జనవరి 16: 41 రోజులుగా అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములు మంగళవారం వేకువజాము నుంచే ఇక్కడి అయ్యప్ప ఆలయంలో ఇరుముడి కట్టుకుని పలు వాహనాల్లో శబరిమలైకి తరలారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా 70 మంది భక్తులు మాల ధరించి 15 సన్నిధానాల్లో నిత్యం పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో గురుస్వామి పల్లె జితేందర్‌గౌడ్ నేతృత్వంలో నిత్యాన్నదానం చేపట్టారు.

మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్, జనవరి 16: నర్సాపూర్ మండలం గొల్లపల్లిలోని కేతకీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ 23 నుంచి 26 వరకు పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు రానున్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రేపు బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ కృతజ్ఞతా సభ

గజ్వేల్, జనవరి 16: ఈ నెల 18, గురువారం రోజున గజ్వేల్ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ కృతజ్ఞతా సభను నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 16: మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ జంట గ్రామమైన మండల పరిధిలోని ర్యాకల్, గంగాపూర్‌లలో హైమాస్ట్ లైట్లను, మంగల్‌పేటలో సీసీరోడ్లను ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతున్నదన్నారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ శంకర్, ర్యాకల్ సర్పంచ్ సుజాతాగుండ్రెడ్డి, గంగాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు నాగం జీవన్, మాజీ ఎంపీటీసీ విద్యాసాగర్, శెట్టి శంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, రాంరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వగృహంలో జంగమ సమాజం వారు, కల్లుగీత కార్మిక సంఘం వారు రూపొందించిన 2024 క్యాలెండర్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆవిష్కరించారు. మండల పరిధిలోని జూకల్ శివారులో ఉన్న కన్వెన్షన్ హాల్‌లో బుధవారం 2 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తహసీల్దార్ దేవిదాస్ తెలిపారు.



మంగల్‌పేటలో రిమోట్‌తో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

కేతకీలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పూజలు

ఝరాసంగం, జనవరి 16: మండల కేంద్రమైన ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరస్వామిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో పూజలు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి స్వర్ణాభరణాల ఊరేగింపు

సదాశివపేట, జనవరి 16: మకర సంక్రాతి పర్వదినం సందర్భంగా సోమవారం పట్టణంలో అయ్యప్పస్వామి స్వర్ణాభరణాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణ పురవీధులన్నీ అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమోగాయి. అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మకరవిళక్కు, స్వర్ణాభరణాల ఊరేగింపు మహోత్సవాలు కేరళ రాష్ట్రంలోని శబరిమలను తలపించాయి. ఈ వేడుకలను తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని అయ్యప్ప స్వామి స్వర్ణాభరణాలకు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప సేవాసమితి ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర నాయకుడు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడిరాజు అయ్యప్ప ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వర్ణాభరణాల ఊరేగింపు ఉత్సవాల్లో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాభరణాల ఊరేగింపు ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు

వైభవంగా అయ్యప్పస్వామి ఆభరణాల శోభాయాత్ర

సంగారెడ్డి రూరల్, జనవరి 16: అయ్యప్పస్వామి ఆభరణాల శోభాయాత్ర సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వైభవంగా నిర్వహించారు. గురుస్వామి రాము ఆధ్వర్యంలో సంజీవనగర్ హనుమాన్ ఆలయం నుంచి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల శ్రీనవరత్న హనుమాన్ సహిత అయ్యప్పస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. మణికంఠ ఉత్సవ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్షాధారులు పాల్గొన్నారు.

పెన్నార్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు, జనవరి 16: పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని పెన్నార్ పరిశ్రమ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వచ్చే యూనియన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం కార్మికులతో సమావేశమై డిమాండ్ల సాధనపై చర్చించారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం అలసత్వం సహించేది లేదన్నారు. యాజమాన్యాలకు తొత్తులుగా పనిచేసి కార్మికుల హక్కులను తుంగలో తొక్కిన యూనియన్లు, నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా యాజమాన్యం మెడలు వంచి హక్కులను నెరవేర్చుకుందామన్నారు. పెన్నార్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పెన్నార్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పెన్నార్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న కాట శ్రీనివాస్‌గౌడ్

దూళిమిట్టలో ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు

మద్దూరు, జనవరి 16: దూళిమిట్ట మండల కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా దూళిమిట్ట స్పోర్ట్స్‌క్లబ్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజులపాటు ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడోత్సవాలు సోమవారంతో ముగిశాయి. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని వరంగల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం తెలిపారు. కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానం దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్, ద్వితీయస్థానం హుస్నాబాద్ క్లబ్ సాధించాయి. తృతీయ, చతుర్థ స్థానాల్లో చేర్యాల, కట్కూర్ గ్రామాలు నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానం కొమురవెల్లి మల్లన్న టీం, ద్వితీయస్థానం సిద్దిపేట క్లబ్ సాధించగా తృతీయ, చతుర్థ స్థానాల్లో దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్, గజ్వేల్ జట్లు నిలిచాయి. విజేతలకు సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి నగదుతో పాటు షీల్డులు అందించారు. గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ రక్షిత, శివాని, ద్వితీయ కొండూరి స్నేహ, ఎం.కవిత, తృతీయ వి.వాసవి, వసుమతి బహుమతులను గెలుచుకున్నారు. జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, సర్పంచ్ దీపికావేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ లింగం, జాలపల్లి ఎంపీటీసీ కల్యాణికమలాకర్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత రాయల్ లెజెండ్

సదాశివపేట, జనవరి 16: సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామంలో సర్పంచ్ పబ్బతి లక్ష్మారెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఐదురోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటి విజేతగా వెల్టూర్ రాయల్ లెజెండ్ టీం, రెండో విజేతగా ముబారక్‌పూర్ టీంలు నిలిచాయి. టోర్నమెంట్ ముగింపునకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మొదటి విజేతకు రూ.50 వేలు, ట్రోఫీ, రెండో విజేతకు రూ.25వేల నగదు బహుమతులను అంజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడారు. గ్రామ సర్పంచ్ పబ్బతి లక్ష్మారెడ్డి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి తీసుకెళ్తూ, క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే సర్పంచ్ లక్ష్మారెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అందరిలో పోటీతత్వం అవసరం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి



పద్మశాలిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

జహీరాబాద్, జనవరి 16: ప్రతిఒక్కరిలో పోటీతత్వం అవసరమని మాజీ డీసీసీబీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మశాలిభవన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రంగం ఏదైనా ప్రతి ఒక్కరిలో పోటీతత్వం ఉన్నప్పుడే ఆశించిన గమ్యాలకు చేరుకుంటారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు కాలనీల్లో తిరిగి ఆయా ఇళ్ల ముంగిట వేసిన ముగ్గులను పరిశీలించారు. గ్లోబల్ పాఠశాల డైరెక్టర్ స్వాతి జైపాల్, మల్‌చెల్మ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణాకైలాష్ పాల్గొన్నారు.

కొవిడ్ 19పై ఏఎన్‌ఎం, ఆశాలకు అవగాహన

మద్దూరు, జనవరి 16 : మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం కొవిడ్ 19పై ఏఎన్‌ఎం, ఆశాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లద్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ రాణి మాట్లాడారు. కొత్త సంవత్సరం నుంచి కొవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ముందస్తుగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైరస్ నివారణకు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని పాటించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ హేమలత, స్టాఫ్‌నర్స్ మాధవి, ఏఎన్‌ఎంలు శాంత, నిర్మల, రత్న, స్వరూపతో పాటు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధ్యమే

జగదేవ్‌పూర్, జనవరి 16: సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని చిన్మయ మిషన్‌స్వామి యజ్ఞానంద పేర్కొన్నారు. మంగళవారం మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో నిర్వహించిన ఓ యువతమేలుకో అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ విద్యార్థులు యువత సంకల్ప బలం పెంచుకుంటే జీవితంలో ఏ స్థాయికి అయినా చేరుకోవచ్చన్నారు. రామాయణ, మహాభారత ఇతిహాసలను నిత్య జీవితంలో అన్వయించుకుని ప్రస్తుత జీవితంలో వాటిని శాస్త్రీయ పద్ధతిలో అనుసరించాలన్నారు. సరైన విద్యను అభ్యసించి భావితరాలకు అందించాన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పండరీ, అసిస్టెంట్ గవర్నర్ హరిశంకర్, వివిరమణ, గ్రామ సర్పంచ్ భాగ్యబిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, పీపీసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామి యజ్ఞానంద

పండుగపూట తాగునీటి తిప్పలు

● ట్యాంకర్ల ద్వారా సమస్య తీర్చిన సర్పంచ్

కొండపాక, జనవరి 16: మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో మిషన్ భగీరథ నీరు అప్పుడప్పుడు అంతరాయం కలుగుతుంది. పైపులు సరిగా ఉండకపోవడంతో పాటు వివిధ కారణాలతో సరఫరా నిలిచిపోతుంది. సంక్రాంతి పండుగ రోజు నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందూరి కనకవ్వ ఐలయ్య ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ నీటిని సరఫరా చేసి సమస్యను తీర్చారు.



ఇంటింటికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

యాదగిరి కుటుంబానికి రఘునందన్‌రావు పరామర్శ

చేగుంట, జనవరి 16: చేగుంట మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకుడు చుంచు యాదగిరి తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు యాదగిరి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, వేణు, నాయకులు ఎల్లారెడ్డి, బాలచందర్, పాండు, హరిశంకర్, రఘువీర్, బిక్షపతి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



యాదగిరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రఘునందన్‌రావు

మంగల్‌పేట్ బస్టాండ్ నుంచే బస్సుల రాకపోలు

నారాయణఖేడ్, జనవరి 16: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట ఆర్టీసీ బస్టాండ్ నుంచే బుధవారం బస్సులు రాకపోకలు సాగిస్తాయని స్థానిక డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలోని రాజీవ్ చౌక్ నుంచి బస్సుల రాకపోకలను కొనసాగిస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో రోడ్డు చిన్నదిగా ఉండడానికి తోడు డివైడర్లు నిర్మించడం, తోపుడు బండ్లు పెట్టడం వల్ల బస్సులు మలపడానికి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ఆ ప్రాంతంలో మూత్రశాలలు కూడా లేవని తెలిపారు. ఆయా కారణాల వల్ల బస్సుల రాకపోకలు బుధవారం మంగల్‌పేట బస్టాండ్ నుంచే కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజీవ్ రహదారిపై బస్సును ఢీకొన్న లారీ

బెజ్జంకి, జనవరి 16: లారీ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటన మండలంలోని తోటపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు కరీంనగర్ నుంచి సుమారుగా ముప్పై తొమ్మిది మంది ప్రయాణికులతో బెజ్జంకి బయలుదేరింది. ఈ క్రమంలో తోటపల్లి శివారు రాజీవ్ రహదారిపై కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటి ఆర్టీసీ బస్సును వెనుక భాగంలో ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఓ బస్సు ప్రయాణికుడితో పాటు లారీ డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతున్నట్లు స్థానికులు తెలిపారు. కాగా ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

ఝాన్సీ లింగాపూర్‌లో గడ్డివాము దగ్ధం

రామాయంపేట, జనవరి 16: రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన మంగలి ప్రభాకర్ తన వ్యవసాయ పొలం వద్ద ఉంచిన గడ్డివాముకు మంటలు చెలరేగగా సుమారు 100 మోపులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ట్యాంకర్ ద్వారా మంటలు ఆర్పగా పక్కనే ఉన్న గడ్డివాములకు ప్రమాదం తప్పింది.

జీడిపల్లిలో వివాహిత అదృశ్యం

మనోహరాబాద్, జనవరి 16: వివాహిత అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన బైరి మల్లమ్మ(47) ఈ నెల 7న కుమారుడితో గొడవపడి బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అల్లుడు బిట్ల నవీన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

స్టీల్ పరిశ్రమలో చోరీ, 9 మంది అరెస్టు

మనోహరాబాద్, జనవరి 16: మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని ఎంపీఎల్ స్టీల్ పరిశ్రమలో చోరీకి పాల్పడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీఎల్ పరిశ్రమలో లోడింగ్ సూపర్‌వైజర్లు విజయ్, దుర్గాప్రసాద్, ప్రభాత్‌కుమార్, చరణ్ లోడింగ్ చేసే సమయంలో దొంగతనంగా 33 టన్నుల స్టీల్‌ను ముసలి కుమార్, మహ్మద్ హుస్సేన్‌కు అమ్మారు. ఈ విషయమై పరిశ్రమ యజమాని వినోద్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి విచారణ చేసి 9 మందిని అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు తరలించారు.

మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారిపై చర్యలు

● వారంరోజుల పాటు విధుల నుంచి తొలగింపు

చేర్యాల, జనవరి 16: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఓ భక్తుడి నుంచి అధికంగా డబ్బులు డిమాండ్ చేసి దురుసుగా ప్రవర్తించిన ఒగ్గుపూజారి జినుకల బుచ్చయ్యపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌కు చెందిన కట్ల జనార్దన్‌రెడ్డి రెండు రోజుల క్రితం మల్లన్న దర్శనార్థం వచ్చి టికెట్ తీసుకుని గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పట్నం వేసిన క్రమంలో కట్నం పేరిట అడిగినంత డబ్బులు ఇవ్వనందున ఒగ్గుపూజారి జింకల బుచ్చయ్య పట్నంవస్త్రాన్ని చెత్త బుట్టలో వేశాడని ఆలయాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇందుకు స్పందించిన ఆలయ ఈవో బాలాజీశర్మ ఒగ్గుపూజారి జినుకల బుచ్చయ్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలతో పాటు ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు వారం రోజుల పాటు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. భక్తులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు హిషాంత్



గజ్వేల్‌టౌన్, జనవరి 16: 67వ జాతీయస్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలకు బాకి హిషాంత్ ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్‌కు చెందిన హిషాంత్ గతనెల డిసెంబరు గద్వాల్‌లో జరిగిన అండర్-17 పోటీల్లో ఐదు మ్యాచ్‌లలో 10 వికెట్లు తీసి రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటాడు. ఈ నెల 16 నుంచి 23 వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో హిషాంత్ పాల్గొననున్నట్లు తెలిపారు.

అయోధ్య రాముడి జెండాల పంపిణీ

కొండపాక, జనవరి 16: కుకునూరుపల్లి గ్రామంలో ఇంటింటికి అయోధ్య రాముడి జెండాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాముడు జన్మించిన రామ జన్మభూమి అయోధ్యలో ప్రతిష్ఠాపన సందర్భంగా రామకృష్ణ ట్రస్ట్ అజ్ఞానుసారం ప్రతి ఇంటిపై కాషాయం జెండా కట్టే విధంగా బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఇంటింటికి కాషాయ జెండా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిపై జెండా కట్టుకోవాలని తెలిపారు. వాసవీ క్లబ్ కొండపాక అధ్యక్షుడు ఉప్పల రాజు, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కొమరవెల్లి సంతోష్, కాపర్తి రాజు, కొడితల సంతోష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'భట్టి'ని కలిసిన సేవాలాల్ రాథోడ్

కంగ్టి, జనవరి 16: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం హైదరాబాద్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవాలాల్ రాథోడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. బంజారాల ఆరాధ్య గురువు సేవాలాల్ మహరాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. బంజారా కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు గిరిజన తండాల అభివృద్ధి కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.